# 106. సంఘ జీ.వి. రంగనాథం

**సు**మారు ఇరవయ్యేళ్ల కిందటిమాట. నేనూ రంగనాథం పనిచేస్తూ వుండిన ఆఫీసుకి, మా డిపార్టుమెంటులో కొత్తగా ఏర్పడిన ఉద్యోగుల సంఘం తాలూకు రాష్ట్రస్థాయి (ప్రధాన) కార్యదర్శి వచ్చి మమ్మల్నందర్నీ సంఘంలో సభ్యులుగా చేరమని ఒక "డ్రయివు" తెచ్చేడు.

"మీరందరూ మన సంఘంలో సభ్యులుగా చేరితే అది మనకి చాలా బలం. సంఘ బలంతో సంఘటిత శక్తి వస్తుంది. అప్పుడు మనం మన సమస్యల్ని అధికార్ల దృష్టికీ ప్రభుత్వం దృష్టికీ తీసికెళ్తే పరిష్కారం సులభం అవుతుంది" అని చందా రసీదుల పుస్తకం తెరిచాడు.

"సంఘంలో చేరకపోతే ఏం? మీరంతా చేరుతున్నారు కదా. మీరు సాధించే సమస్యా పరిష్కారం నాక్కూడా వర్తిస్తుంది కదా" అంటూ, అదేదో సినిమాలో "మీ అభిప్రాయమే మా అభిప్రాయం" అని డైలాగు చెప్పిన పాత్రలా రంగనాథం తప్పించుకున్నాడు.

"ఆఫ్టరాల్, నెలకొక రూపాయి చందాకట్టడానికి అంత గిలగిల్లాడిపోతావేం?" అని దుర్భాష లాడేను.

"మన మేలుకోసం ప్రయత్నిస్తూ ఉన్న మన నాయకులకు ప్రోత్సాహం ఇవ్వాలి" అని సద్భాష కూడా ఆడేను.

అయినా రంగనాథం కంగలేదు. "ఇలా చందాలు వసూలుచేసి నాయకులంతా ఊళ్లు తిరిగి లాడ్జీల్లో రూములు తీసుకుని డబ్బు దుబారా చేస్తారు. చందాలు ఎంత దిట్టంగా వసూలయితే అంత గొప్ప హోటళ్లలో మకాం చేస్తారు. ఖర్మం కాలి మన డిమాండ్లలో ఏదైనా ఒకటి తీర్చడానికి సిద్ధపడి ప్రభుత్వం ఆర్డరు వేస్తే ఆ సందర్భంగా ఫలానా ఫలానా అధికార్లకిందా ప్రజానాయకుల కిందా ఖర్చులు పెట్టేం అని చెప్పి సంఘం డబ్బు కైంకర్యం చేసినా చేస్తారు. ఇదంతా ఇలా ఉండగా సంఘం పెద్దలికి మనలాగ డ్యూటీ బాధ వుండదు. శలవయినా పెట్టకుండా రాష్ట్రంలో ఈ కొసనించి ఆ కొసదాకా పర్యటనలు చేసి సరదాలు తీర్చుకుంటారు. నాకు తెలీదనుకోకు." అని విరుచుకు పడ్డాడు.

ఆ సాయంకాలం నేను ఇంటికి వెళుతూ తోవలోనే ఉన్న రంగనాథం ఇంట్లో కొంతసేపు గడిపినప్పుడు మేం ఇద్దరం ముందు గదిలో కూర్చుని వుండగా రంగనాథం కొడుకు తన పాఠంలో వున్న ఒక్క వాక్యం బిగ్గరగా చదువుతూ "మానవుడు సంఘజీవి!" అన్నాడు.

"విన్నావా?" అన్నాను, నవ్వుతూ.

"గాడిద గుడ్డేం కాదూ?" అని నన్ను కసిరేసి; "ఒరే, నువ్వులోపలి గదిలో కెళ్లి చదువుకో!" అని కొడుకుని అక్కణ్ణించి తరిమేశాడు.

ఆ మరుసటి నెల్లో, రంగనాథానికి; ప్రభుత్వ రంగంలో నడిచే ఒక వ్యాపార సంస్థలో అధికారిగా సెలెక్షన్ వచ్చింది. మా డిపార్టుమెంట్‌లో అతను చేసిన పదేళ్ల సర్వీసు కూడా వొదులుకోకుండా ట్రాన్స్‌ఫర్ పద్ధతిమీద వెళ్లిపోయాడు. అక్కడ కూడా ఉద్యోగుల సంఘం ఒకటివుంది గాని, ఇతను "ఉద్యోగి" కాదు కదా! అలా "సంఘజీవి"గా ఉండవలసిన బాధ్యతను తప్పించుకున్నాడు.

ట్రాన్స్‌ఫర్ల మూలంగా ఎక్కడెక్కడో పనిచేసి ఇంకెక్కడో రిటైరయినా నేను స్వస్థలంలోనే స్థిరపడవలసి వచ్చింది. ఒకనాడు న్యూస్‌పేపరులో "చిన్నపేపరు" చూస్తూ ఉండగా హటాత్తుగా

నా దృష్టి ఒక వార్తదగ్గిర ఆగిపోయింది. వార్తకి మీద జాగాలో ఉన్న ఫొటో చూసేక మరీనీ.

"చిన్నపేపరు" నేటి వార్తాపత్రికా సంస్కృతిలో ఒక విశేషం. (పిల్లవాళ్ల పరీక్షలో బిట్ కొశ్చన్ల పేపర్ లాంటిది అని చెప్పొచ్చు.) లోకల్ ఎడిషన్ అనగా స్థానిక సంచిక. (లోకాల ఎడిషన్ అని పెద్దపేపరు గురించి చెప్పుకోవచ్చు.) దీని సైజు పెద్దపేపరులో సగానికి ఉంటుంది. చీమ మిరపకాయ చిన్నదే అయినా కారం ఎక్కువ ఉన్నట్టు చిన్నపేపరు ఆకర్షణే వేరు. ఎందుకంటే మనం ఉండే ఊళ్లోనూ మన చుట్టుప్రక్కల ఊళ్ళలోనూ ఏమిటి జరిగేయి - ముఖ్యంగా పోలీసు స్టేషన్లూ కోర్టులూ సరఫరా చేసే క్రయిమ్, ఏక్సిడెంట్ అండ్ పనిష్మెంట్ వార్తలు ఈ 'చిన్నపేపరు' అనబడే దాంట్లో ఉంటాయి. పెద్దపేపరులో వచ్చే వార్తలన్నీ నిన్న రాత్రి టీవీలో చూపెట్టినవీ వినిపించినవే అయి వుంటాయి. కనక పేపరు ధఢ్ఢమని ఇంట్లో పడగానే ఇంట్లో ఎక్కువ మంది ఉరుకులూ పరుగులూ వేసి కొండొకచో తొక్కిసలాటకి కారణ భూతం అయ్యేది చిన్నపేపరే.

ఇంతకీ నన్ను అటకాయించిన ఆ వార్త ఏమిటంటే ఒకానొక సంఘం రజతోత్సవం సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న (జీవి) రంగనాథం జ్యోతి వెలిగించి సభాప్రారంభం చేసేడు. ఆ ఫోటో, ఆ వార్త; మా అబ్బాయికి చూపించి - "ఒరే, ఈ రంగనాథం ఆఫీసులోనూ ఇంట్లోనూ ఫోన్లుంటాయి కదా; ఆ నెంబర్లు నోట్ చేసుకురా; నేను ఇతనితో మాట్లాడాలి" అన్నాను.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి; ఇతనూ నేనూ చిన్నప్పుడు ఒకే డిపార్ట్మెంట్లో ఒకే ఆఫీసులో కొన్నాళ్లు పనిచేసాం."

"ఆ పరిచయం అదీ ఇప్పుడాయనకి గుర్తు చెయ్యడం ఎందుకు నాన్నా. ఆయన చాలా బిజీగా ఉంటారు!" అన్నాడు మా వాడు.

మర్నాడు, మూడోనాడు, నాలుగో నాడు - ఇలా ఇంచుమించు ప్రతిరోజూ రంగనాథం ఏదో ఒక సంఘం వారు నిర్వహించిన ఏదో ఒక సభలో ముఖ్య అతిథిగా, వక్తగా, అధ్యక్షుడుగా, బహుమతి ప్రదాతగా రకరకాల అవతారాల్లో పాలుపంచుకోడం, ఆ వార్త, ఆఫోటో మర్నాటి పేపర్లో (చిన్నపేపరులో) వచ్చేయడం చూసి రంగనాథం చాలా బిజీగా వున్నాడన్న సంగతి నాకు పూర్తిగా వంటపట్టింది.

కొన్నాళ్లకి మా కులం సంఘం వాళ్లు రంగనాథానికి సన్మానం ఏర్పాటు చేస్తే అతని టైమ్ వేస్టు చెయ్యకుండా అతన్ని కలుసుకోవచ్చు కదా అని ఆ సభకి వెళ్లేను. రంగనాథం నన్ను గుర్తుపట్టినందుకు కృతజ్ఞతగా నేనొక పని చేసాను; సన్మాన దండల భారంతో అతని మెడ కుంగిపోకుండా ఉండేందుకు గాను వాయిదాకి ఇన్ని అన్న లెక్ఖలో దండలు పక్కని పెట్టేస్తూ వుండడం గమనించి; ఎవరో అతనికి శాలువా కప్పుతున్న సందట్లో ఆ దండల్లో కాస్త లావుపాటి దొకటి దొరక బుచ్చుకుని; "నేను సైతం సన్మానార్థికి దండ నొక్కటి సమర్పించాను" అనిపించుకున్నాను.

సభనుంచి తిరిగి ఇంటి రావడానికి నేను హాల్లోంచి ఇవతలికి వచ్చిన కొద్ది సెకండ్లలో రంగనాథం నన్ను ఆదుకొన్నాడు; "పద! కారులో నిన్ను మీ ఇంటి దగ్గిర డ్రాప్ చేస్తాను." అంటూ.

తోవలో - 'మొత్తంమీద సంఘజీవి అనిపించుకున్నావు!" అన్నాను.

"అలా ఎన్నటికీ జరగదు" అన్నాడు రంగనాథం. "మన సమాజంలో సంఘాలకి గొప్ప ప్రాధాన్యం ఏర్పడినమాట అయితే నిజమే. కులాల సంఘాలు, ఉద్యోగుల సంఘాలు, నిరుద్యోగుల సంఘాలు,

అధికార్ల సంఘాలు, రకరకాల వృత్తుల వాళ్ల సంఘాలు, వినియోగదారుల సంఘాలు, మహిళా సంఘాలు, ఇవన్నీ కాక రోటరీ, లయన్స్ రోటరాక్టు, ఇంటరాక్టు, ఇన్నర్‌వీల్ క్లబ్బులు - అదెవరో అన్నట్టు ఇంచుమించుగా మనుషులెందరుంటే సంఘాలు కూడా అన్ని తయారయ్యేయి. అయితే నేను మాత్రం ఏ సంఘంలోనూ మెంబర్ని కాను. అంచేత అందరికీ మిత్రుడుగా, అజాత శత్రుడుగా ఉండగలుగుతున్నాను!"

"జీవి రంగనాథం "సంఘజీవి" కాదు; సంఘోపజీవి" అని నేను గ్రహించేసరికి కారు మా ఇంటికెదురుగా ఆగింది.

★

# 107. వర్క్సు - పెర్క్సు

మధ్యాన్నం ఒంటిగంట అవుతూ వుండగా చెమట్లు కక్కుకుంటూ ఉస్సూ, అస్సూ అంటూ వొచ్చాడు నరిసింగరావు మా ఆఫీసుకి. సరిగ్గా అప్పుడే నా భోజనం కేరియర్‌తో వచ్చాడు రాజన్న.

"అమ్మయ్య! సీట్లో ఉన్నావు. అదృష్టవంతుణ్ణే" అని తలెత్తి పైకి చూశాడు. "ఫాన్ తిరుగుతూనే ఉందా?" అని తన అలసట మీద తనే విసుక్కున్నాడు.

నేను టేబిలు క్లీను చేసుకుని భోజనం సరంజామా దానిమీద పేర్చుకుంటూ వుండగా "నువ్వు నాతో స్టేషన్‌కి రావాలి..." అన్నాడు.

"మళ్ళీ ఏదైనా పీకలమీదికి తెచ్చేవా?" అన్నాను.

"పోలీసుస్టేషన్‌కి కాదయ్యాబాబూ. రైల్వేస్టేషన్‌కి. నేను ఇవాళ సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు వెళ్లాలి. నా టిక్కెట్టుకి వెయిటింగ్ లిస్టు నెంబరు తొంభై రెండువచ్చింది. నీకు తెలుసుగా. నేను నిలబడీ కూర్చునీ అంతదూరం ప్రయాణం చెయ్యలేను. రైల్వే డివిజనల్ ఆఫీసులో నీకు తెలిసిన వాళ్లున్నారు కదా. ఎమర్జన్సీ కోటాలో బెర్తు ఒకటి నాకు ఇప్పించాలి".

"ఓస్ ఇంతేనా!" అని రాజన్నకి సంజ్ఞచేసి పిలిచేను. "కేరియర్ నేనింటికి పట్టుకెళ్తాను గానీ, నువ్వు వెంటనే మీ ఇంటికి వెళ్లి; నీ భోజనం కానిచ్చి రైల్వేస్టేషన్‌కెళ్లు. ఈ అయ్యగార్ని చూసేవు కదా. ఇతనికి ఒక బెర్తు రిజర్వేషన్ చెయ్యి" అని చెప్పేను.

"నా టిక్కెట్ నెంబరు రాసివ్వనా?" అన్నాడు నరిసింగరావు. "అక్కర్లేదు బాబూ, ఇంతోటి దానికీ టిక్కెట్ నెంబరేల?" అని రాజన్న చెప్పేసరికి "స్టేషన్‌కి ఆటోలో వెళ్లు" అని నర్సింగరావు ఒక ఐదు రూపాయలనోటు రాజన్నకి ఇవ్వబోయాడు. రాజన్న ముక్కుమీద వేలేసుకుని "తప్పు, బాబయ్యా; అలాటోణ్ణిగాదు." అని వెళ్ళిపోయాడు.

నా భోజనం పూర్తయ్యేదాకా నరిసింగరావు కదల్లేదు. "నువ్వెళ్లు. భోజనం చేశావో లేదో. సూట్‌కేసు సర్దుకోవాలో ఏమిటో." అన్నాను. "నాకు ఆ రాజన్న మీద నమ్మకం లేదు. నువ్వొస్తే బావుణ్ణు" అని నసిగాడు. "సరే; నువ్వు రైలుకి వెళ్తూ ఇటు రా. నీతోబాటు నేనూ స్టేషన్‌కొచ్చి నిన్ను రైలెక్కిస్తాను. నువ్వు తెల్లవార్లూపడుకొని ప్రయాణం చేసేటట్టు చూసే పూచీ నాది. సరా?" అని నేనన్నాక వెళ్లేడు.

రైల్లో, నిద్రవేళదాకా కూర్చోడానికి కిటికీ పక్కసీటు, నిద్దరాగానే పడుకుందికి "బెర్తు" (జనరల్ కంపార్టుమెంట్‌లో) ఏర్పాటు చేసేడు రాజన్న. నరిసింగరావు "ఇదే బాగుందే! ముప్ఫయి రూపాయలు